
మీనం.. దైన్యం

భానుడి ప్రతాపానికి చెరువులు ఎడారులను తలపిస్తుండగా అందులోని చేపలు విలవిల్లాడుతున్నాయి. ఒక్కసారిగా నీటి నిల్వలు తగ్గిపోతుండటంతో చేపలన్నీ మృత్యువాత పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

జీలుగ కోసం బారులు



మిరుదొడ్డిలోని రైతు సేవా కేంద్రం వద్ద నిల్చున్న రైతులు

మిరుదొడ్డి(దుబ్బాక): జీలుగ విత్తనాల కోసం రైతులు బారులు తీరుతున్నారు. మిరుదొడ్డిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం క్యూ కట్టారు. జీలుగ విత్తన బ్యాగుల కోసం కొద్దిసేపు రసాభాసగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. అరకొరగా సరఫరా కావడంతోనే ఈ తిప్పలని, సరిపడా విత్తనాలను సరఫరా చేసి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

31న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిద్దిపేట జోన్: స్థానిక స్టేడియంలో ఈ నెల 31న ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకట స్వామి గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్–8, 10, 12, 14, 16, 18, 20, ఓపెన్ విభాగంలో బాల బాలికలకు, స్త్రీ పురుషులకు వేరువేరుగా ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 30న సాయంత్రం ఐదు గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్, మొదటి మూడు స్థానాలు నిలిచిన వారికి పతకాలు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జూన్ 6,7 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు 97046 61898, 8501977079 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'టెట్'కు 88 మంది హాజరు

సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు మంగళవారం 88 మంది హాజరయ్యారు. పరీక్షను సీబీటీ విధానంలో ఉదయం 9 నుంచి 11.30 వరకు నిర్వహించిన ఉదయం సెషన్‌కు 41 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు నిర్వహించిన సెషన్‌కు 50 మందికి 47 మంది హాజరయ్యారు. 12 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నాగభూషణం, టీసీఎస్ ఆఫీసర్ రాకేశ్, పీఆర్వో రఘు, షాదుల్లా, డీపీ రావు, కరీముద్దీన్, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

కవుల ఘనత చాటింది సురవరమే..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ కవుల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సురవరం ప్రతాప్‌రెడ్డి అని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. మంగళవారం తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ముందుగా సురవరం ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కథల తాతయ్య ఎన్నవెల్లి రాజమౌళి మాట్లాడుతూ 354 మంది తెలంగాణ కవుల పరిచయంతో గోలకొండ కవితా సంచిక ప్రచురించి చరిత్రలో నిలిచిపోయిన సురవరం ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్ కుమార్, పరశురాములు పాల్గొన్నారు.

విమానం ఎగరాలి.. ప్రతిభ ఎల్లలు దాటాలి



విద్యార్థి తయారీ చేసిన మోడల్ విమానం

ఇదేమిటీ.. స్టేడియంలో కార్గో విమానం ల్యాండ్ అయ్యిందా? అని అనుకుంటున్నారా.. కాదండోయ్.. కార్గో విమానం నమూనా.. ఓ ఇంజినీరింగ్ విద్యార్థి విశేష కృషికి నిలువుటద్దం ఇది. అతి తేలికైన డేప్రాన్ షీట్స్ ఉపయోగించి కార్గో మోడల్ విమానం తయారు చేశాడు. పట్టణానికి చెందిన బాసంగారి లక్ష్మీ నర్సింహ ప్రస్తుతం మెకానిక్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రూ.44 వేలు ఖర్చు పెట్టి ఆరున్నర కిలోల బరువు ఉన్న కార్గో మోడల్ విమానాన్ని తయారీ చేశాడు. దానిని ఎగిరేసేందుకు ట్రయల్ రన్ నిర్వహించారు. కొన్ని లోపాల వల్ల పైకి ఎగరలేదు. త్వరలోనే లోపాలను సవరించి ఎగిరేలా చేస్తానని లక్ష్మీనర్సింహ అన్నారు. - సిద్దిపేటజోన్

కౌంటింగ్.. కౌంట్‌డౌన్

ఓట్ల లెక్కింపునకు యంత్రాంగం కసరత్తు

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో ఆరు రోజుల్లో అభ్యర్థుల భవితవ్యం తెలిపోనుంది. మెదక్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి, బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్ రావు, కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధు తోపాటు మరో 41 మంది పోటీ చేశారు. అలాగే కరీంనగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్, బీఆర్‌ఎస్ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా రాజేందర్ రావులతో పాటు మరో 25 మంది పోటీచేసిన విషయం తెలిసిందే. మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జూన్4 న నిర్వహించనున్నారు. – సాక్షి, సిద్దిపేట

312 సిబ్బంది నియామకం

- మెదక్ లోక్‌సభ కౌంటింగ్ నర్సాపూర్‌లో..
- ఆరు రోజుల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



కలెక్టరేట్‌లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ (ఫైల్)

లోక్‌సభ ఎన్నికలను సమర్థంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. మెదక్, కరీంనగర్, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోకి సిద్దిపేట జిల్లా రానుంది. కౌంటింగ్ కోసం అధికారులు, సిబ్బందికి ఇప్పటికే మొదటి దశ శిక్షణ ఇచ్చారు. జూన్ 2న మలిదశ శిక్షణ ఇవ్వనున్నారు.

సిబ్బందికి శిక్షణ

మెదక్ లోక్‌సభ కౌంటింగ్‌ను నర్సాపూర్‌లోని సీబీఆర్‌టీ కళాశాలలో, కరీంనగర్‌కు సంబంధించి పట్టణంలో ఎస్ఆర్ఆర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 26 మంది చొప్పున మైక్రోఅబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లను మొత్తంగా 312 మందిని నియమించారు. ఈ నెల 22న మొదటి దశ శిక్షణను డీపీఓ దేవకిదేవి నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. జూన్ 2న రెండో దశ శిక్షణ ఇవ్వనున్నారు. జూన్3న కౌంటింగ్ సిబ్బంది రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

భద్రత 'స్ట్రాంగ్'

జిల్లాలో 9,66,332 మంది ఓటర్లుండగా 7,56,889 (78.32 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో స్వీకరించిన వీవీప్యాట్‌లను లోక్‌సభ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. వీటికి కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్‌ల చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

అభ్యర్థుల్లో టెన్షన్..

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. పోలింగ్ ముగిసిన తర్వాత బూత్‌ల వారీగా లెక్కలు వేసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ గెలుపు ధీమాతో ఉన్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య పోరు నడిచింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లోక్‌సభకు పోటీ చేసిన అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను నియమిస్తున్నారు. ఏజెంట్‌ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. బరిలో నిలిచిన అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లకు పలు సూచనలు చేస్తున్నారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- విద్యాశాఖ అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్స్, రూట్ ఆఫీసర్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో పాటు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిజినల్ కో ఆర్డినేటర్ రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రూప్–1 పరీక్ష నిర్వహణ గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 21 సెంటర్లలో 8,239 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. వచ్చే నెల 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. బయోమెట్రిక్ ప్రాసెస్‌లో కేంద్రానికి అనుమతిస్తారని అన్నారు. పరీక్షా కేంద్రంలో ఏదైనా సమస్య తలెత్తినా, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం చుట్టూ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ నోడల్ ఆఫీసర్ అదనపు డీసీపీ(ఏఆర్) సుభాష్ చంద్రబోస్ కు సూచించారు.

కేంద్రీయ విద్యాలయ పనుల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయ భవనంలో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి శివారులో నిర్మాణమవుతున్న కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ మహేష్, తహసీల్దార్ సలీం పాల్గొన్నారు.

కల్తీ రహిత జిల్లాయే లక్ష్యం

- నకిలీ విత్తన అక్రమార్కులపై పీడీ యాక్టు
- సీపీ అనురాధ
- టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాను కల్తీ రహిత విత్తనాల జిల్లాయే లక్ష్యంగా అధికారులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని పోలీసు కమిషనర్ అనురాధ సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులతో మంగళవారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల విక్రయాలలో తరచూ కేసులు నమోదైతే పీడీ యాక్టు అమలు చేయాలన్నారు. దుకాణాల్లో ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో కల్తీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అక్రమ రవాణ నియంత్రించేందుకు జిల్లా సరిహద్దుల్లో నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. దుకాణ పేరు, అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100, సిద్దిపేట పోలీసు కమిషనరేట్ వాట్సప్ నంబర్ 87126 67100 సమాచారం తెలపాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, టాస్కఫోర్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిజ్ఞానం పెంచుకోవాలి

జూలై 1 నుంచి అమలయ్యే నూతన చట్టాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అధికారులకు సూచించారు. నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. దేశంలో నేర, న్యాయ వ్యవస్థను మార్చేందుకు తీసుకున్న చర్యలలో భాగంగా నూతనంగా మూడు చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. నూతన అంశాలను నేర్చుకోవాలని, నూతన సెక్షన్‌ల ప్రకారం వివిధ కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తెలంగాణ పోలీసు అకాడమీలో నూతన చట్టాలపై శిక్షణ పొందిన అధికారులతో బ్యాచ్‌ల వారీగా నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జానకీరామ్‌రెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనలపై ప్రత్యేక దృష్టి

వర్ల్డ్ వెజ్ సెంటర్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అరవాజీ సెల్వరాజ్



ఎంఓయూలను మార్చుకుంటున్న ప్రతినిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యవసాయ రంగంలో ప్రపంచ సవాళ్లను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని వర్ల్డ్‌వెజ్ సెంటర్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అరవాజీ సెల్వరాజ్ అన్నారు. మంగళవారం ఇక్రిశాట్ ప్రాంగణంలోని వర్ల్డ్‌వెజ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వర్ల్డ్ వెజ్ సెంటర్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రీయ సహకారం, ఆవిష్కరణ పెంపొందించడానికి సంతకాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఏఆర్, ఎన్‌బీపీజీఆర్‌లతో కలసి పని చేయడం ద్వారా వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఉమ్మడిగా పోషకాహార భద్రత పెంపొందించడం, స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహిస్తామని చెప్పారు. పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయడానికి , జన్యు వనరులను విస్తరించడానికి ఈ ఒప్పందం ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. దీనివల్ల రైతులకు, వినియోగదారులకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం ఐసీఏఆర్–ఎన్‌బీపీజీఆర్ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ... వరల్డ్‌వెజ్ సెంటర్ సహకారం పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, జన్యు వనరులను విస్తరించడానికి ఉపయోగపడుతుందన్నారు.

డీటీఓ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- 70 శాతం 'కోడ్' ద్వారానే సేవలు
- ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏజెంట్‌ల కోడ్‌ల ద్వారానే జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో 70 శాతం పనులు జరుగుతున్నట్లు గుర్తించామని ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనీఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 12.30గంటలకు జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు కార్యాలయంలో రికార్డులు, రవాణాశాఖ సేవల కోసం వాహనదారుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ దాడులు రాత్రి 7గంటల వరకు కొనసాగుతునే ఉన్నాయి. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ మాట్లాడుతూ కౌంటర్‌లలో 100కు పైగా ఉన్న దరఖాస్తులలో 70శాతానికిపైగా ఏజెంట్‌ల కోడ్‌లు ఉన్నట్లు పరిశీలించామన్నారు. కార్యాలయంలో అధికంగా ఏజెంట్‌లు, మధ్యవర్తుల ద్వారానే సేవలు జరుగుతున్నట్లు గమనించామన్నారు. ఈ కోడ్ విధానంపై జిల్లా రవాణాశాఖ అధికారి, ఏఓ, ఏఎంవీఐలను విచారించామన్నారు. ఏజెంట్‌ల ద్వారా వచ్చిన దరఖాస్తులకు త్వరగా పనులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. కార్యాలయంలో గుర్తించిన ఏజెంట్ కోడ్‌లు, కార్యాలయంలోని లోపాలను పై స్థాయి అధికారులకు నివేదిక రూపంలో అదిస్తామన్నారు. ఈ తనిఖీలలో ఏసీబీ ఎస్ఐలు రమేష్, రాజవెంకటగౌడ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో ముందుండాలి



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు, సిబ్బంది

సిద్దిపేటరూరల్: మహిళలు ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అంతర్జాతీయ ఋతుచక్ర ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ఋతుచక్రానికి సంబంధించి వ్యాయామం, ఆహారనియమాలు, యోగా, ధ్యానం వంటివాటిని అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సరోజ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయరూప, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలపై నజర్

లెక్క.. ఇక పక్కా

- రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఉల్లంఘిస్తే దండనే
- నకిలీ నారు, విత్తన విక్రయ కట్టడి
- ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జోరుగా తనిఖీలు



నర్సరీలో కూరగాయల నారు

సిద్దిపేటజోన్: పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నర్సరీల లెక్క పక్కాగా ఉండేలా జిల్లా ఉద్యాన శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కూరగాయలు, పండ్లు, పూలు సాగు జోరు అందుకొనుంది. రైతుల ఆసక్తికి అనుగుణంగా అవసరమైన మొక్కలను, నారును నర్సరీల నిర్వాహకులు విక్రయిస్తున్నారు. ఒకప్పుడు స్వల్ప సంఖ్యలో ఉన్న నర్సరీలు ప్రస్తుతం పెద్ద ఎత్తున వెలిశాయి. ఇష్టానుసారంగా వెలుస్తున్న ప్రయివేటు నర్సరీల లెక్క పక్కాగా తేల్చే పనిలో సంబంధించిన శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి నర్సరీ ఉద్యాన శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఉన్న నర్సరీలలో సగానికి పైగా నిబంధనలు పాటించడం లేదు. ఎదుగుదల లేని మొక్కలు, కల్తీ నారు కొనుగోలు చేసిన రైతులు, ప్రజలు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. నిబంధనల మేరకు నష్ట పరిహారం పొందలేకపోతున్నారు. దీని నియంత్రణకు శాఖ ఆకస్మికంగా నర్సరీలు తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, నిర్వహణ తీరును పరిశీలించనుంది.

నిబంధనల అమలుకు చర్యలు

ప్రయివేటు నర్సరీలలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్న వాస్తవాన్ని జిల్లా అధికారులు గుర్తించారు. ఈ మేరకు నూతన చట్టానికి అనుగుణంగా ప్రతి నర్సరీ జిల్లా ఉద్యాన శాఖలో రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నర్సరీలలో మొక్కల సంఖ్య ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజు వసూలుతో పాటు, నర్సరీ స్థితిగతులు, మొక్కల నాణ్యత, కూరగాయలు, పండ్ల, పువ్వుల, నారు పరిస్థితి, నర్సరీ ఏర్పాటు చేసిన నిర్దేశిత భూమి వివరాలు, నీటి లభ్యత, మట్టి రకం తదితర అంశాలపై ఒక నివేదిక తయారు చేసి జిల్లాలో నర్సరీల లెక్క పక్కాగా ఉండేలా సంబంధిత శాఖ అడుగులు వేయనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనంతరం నర్సరీల ఆకస్మిక తనిఖీల ప్రక్రియ చేపట్టేలా శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రతి నర్సరీ సమగ్ర వివరాలను తెలిపే బోర్డ్, ధరల పట్టిక, అవసరమైన షేడ్స్, మౌళిక వసతులు తప్పనిసరి ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాలని శాఖ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో అనధికారికంగా నర్సరీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ప్రజల, రైతుల ప్రయోజనాలను దూరం చేసే నర్సరీల గుట్టు తేల్చే పనిలో ఉద్యాన వన శాఖ సమాయత్తం అవుతుంది.

నాణ్యమైన నారే విక్రయించాలి

సీజన్ మొదలవుతోంది.. పండ్ల, పువ్వులు, కూరగాయల పెంపకం కోసం రైతులకు అనుకూలమైన వాతావరణం ఇది. ప్రతి నర్సరీ ఉద్యాన శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నాణ్యమైన మొక్కలు, నారు విక్రయాలు చేయాలి. రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల వల్ల రైతు అనుకోకుండా నష్టానికి గురైతే నిబంధనల మేరకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. నర్సరీల వాస్తవ స్థితిగతులు, రిజిస్ట్రేషన్ వివరాల కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం.

–సువర్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి. సిద్దిపేట

క్లుప్తంగా

ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నల కొనుగోళ్లు

మంత్రి లేఖకు రాష్ట్ర కార్యదర్శి స్పందన

నారాయణఖేడ్: జొన్న రైతులకు శుభ వార్త. ఉమ్మడి మెదక్ జిల్లాలో జొన్న పంట సాగు చేసిన రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నల కొనుగోళ్లు జరుగుతున్నాయి. కాగా ఎకరాకు 8 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. దీంతో మిగితా పంట వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకొని రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతీ ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. మంత్రి రాసిన లేఖకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి తక్షణం స్పందించి ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ కోసం భూసేకరణ

రైతులతో ఆర్డీఓ జయచంద్రారెడ్డి సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణలో భాగంగా గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, దాతర్ పల్లి గ్రామాల రైతులతో కార్యాలయంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి భూసేకరణ విషయంలో అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పరిహారం అందించనుందని తెలిపారు. మండలంలోని తొమ్మిది గ్రామాలకు చెందిన రైతుల నుంచి 176 హెక్టార్ల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతుల వివరాలు సేకరించామని, గ్రామాల వారీగా సమావేశం నిర్వహించి రైతులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే మండలంలో భూ సేకరణకు పూర్తి కానుందని తెలిపారు.

తండ్రిపై హత్యాయత్నం..

కుమారుడికి 3 నెలలు జైలు

సిద్దిపేటకమాన్: తండ్రిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన కుమారుడికి సిద్దిపేట కోర్టు జైలు శిక్ష విధించింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం నాసర్‌పూరకు చెందిన దొంతరబోయిన రంగయ్యను కుమారుడు దొంతరబోయిన రాజు (30) గొడవపడి కడుపులో తన్ని హత్య చేయడానికి ప్రయత్నించాడు. గాయాలతో బయటపడ్డ రంగయ్య 2019 అక్టోబర్ 30వ తేదీన సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆ రోజు నుంచి ఇప్పటివరకు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ కొనసాగింది. న్యాయమూర్తి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్థుడికి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


సుభాష్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలోని పించెరువులో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మిర్జాపల్లి గ్రామానికి చెందిన పోతరాజ్ సుభాష్ (39) సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత చెరువులో చేపల వేటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం చెరువు సమీపంలో కుటుంబ సభ్యులు వెతకారు. ఒడ్డుపై సుభాష్ బట్టలు కనిపించడంతో అనుమానంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మీనం.. దైన్యం

గ్రాండ్ రిపోర్ట్

- భానుడి ప్రతాపానికి అడుగంటిన వైనం
- నీళ్లు లేక మృత్యువాత పడుతున్న చేపలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దయనీయ పరిస్థితి
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు

ఎండిపోయిన చెరువులు, కుంటలు

మండుతున్న ఎండలకు చెరువులు, కుంటలు పూర్తిగా అడుగంటిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. చెరువుల్లో నీటి శాతం ఒక్కసారిగా తగ్గిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో చేపలు పట్టి జీవనోపాధి పొందే మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. ప్రస్తుతం మార్కెటింగ్ సౌకర్యం అంతలా లేక చేపలు పట్టకపోవడంతో చెరువుల్లోని చేపలు మృత్యువాత పడి పైకి తేలియాడుతున్నాయి. ఎండల వేడి ఉపాధిపై గొడ్డలి పెట్టులా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కాడిపల్లి (నర్సాపూర్) : పూర్తిగా ఎండిపోయి నెర్రెలు వారిన పాంపల్లి చెరువు

క్వింటాళ్ల కొద్ది మృత్యువాత

మిరుదొడ్డి(దుబ్బాక): దంచికొడుతున్న ఎండలకు చెరువులన్నీ ఎండిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో చేపలు పట్టి జీవనోపాధి పొందే మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. ఎండల కారణంగా మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పెద్ద చెరువు, అందెలోని పలు చెరువుల్లో క్వింటాళ్ల కొద్ది చేపలు చనిపోతున్నాయి.


చనిపోయిన ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపలు

నష్టాలనే మిగిల్చాయి

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా 18 గ్రామాల్లో మత్స్య సహకార సంఘాలు నడుస్తున్నాయి. చేపలు పడుతూ జీవనం సాగిస్తున్న వారు దాదాపు 1,098 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండగా మారాయి. మత్స్యకారుల జీవనోపాధికై జిల్లా మత్స్య సహకార సంఘం ద్వారా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు. మత్స్యకారులకు లాభాలు తెచ్చిపెట్టే చేపల కన్న, నష్టాన్ని తెచ్చిపెట్టే క్యాట్ ఫిష్ ఎక్కువగా చెరువు కుంటల్లో పెరిగింది. ఎదిగే కొద్ది ఈ చేపలు కాస్త మిగితా చేపలను తినివేయడం, వాటి ఎదుగుదల పై ప్రభావం చూపడం మత్స్యకారులకు తలనొప్పిగా మారింది. దీనికి తోడు చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో చేపలు చనిపోతున్నాయి.

క్యాట్ ఫిష్‌తో నష్టం



ఇప్పటికే ఎండలకు చెరువులు, కుంటలు అడుగంటిపోయాయి. ఉన్న చేపలను పట్టి అమ్ముకుందామంటే పంపిణీ చేసిన చేప పిల్లల్లో క్యాట్ ఫిష్‌లు చేరడం ఉన్న కొద్దిపాటి నీళ్లలోకి దిగి చేపలను పడదామంటే అవే వలలకు చిక్కుతున్నాయి. అక్కడే వాటిని చంపి పారవేయాల్సి వస్తుంది.

– గంగారాంలు, మత్సకారుడు రంగంపేట


నీరు ఇంకిపోతుండడంతో రంగంపేట తురకల చెరువులో మత్స్యకారుల వేట

15 శాతం కంటే తక్కువ నీరు


దుబ్బాకలోని ఏదుల్ల చెరువులో గుర్రపు డెక్క

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని పెద్ద చెరువు, నల్ల చెరువు, రామసముద్రం చెరువు, ఏదుల్ల చెరువులను 'సాక్షి' పరిశీలించగా అన్ని చెరువుల్లో కేవలం 15 శాతం కంటే తక్కువ గానే నీరుంది. ఇక ఏదుల్ల చెరువు పూర్తిగా ఎండిపోయి కేవలం జేసీబీ గుంతల్లో కొద్దిగా నీరుండడంతో చేపలు చనిపోతున్నాయి. అన్ని చెరువుల్లో కేవలం జేసీబీ గుంతల్లోనే నీరు తప్ప మొత్తం అడుగంటి పోయి గుర్రపు డెక్క, నెర్రెలు వారిన మట్టి కనిపిస్తుంది. చేపలు ఎక్కడికక్కడ చనిపోతుండడంతో ఏం చేయాలో తోచక మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కుప్పలు తెప్పలుగా..



ఎండ తట్టుకోలేక చనిపోయిన చేపలు

వారం రోజుల వరకు వాతావరణం కొంత చల్లబడినా మళ్లీ ఎండలు దంచి కొడుతున్నాయి. జనాలు ఉక్కపోత భరించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మనుషులే కాదు జీవరాశులు సైతం ఎండ వేడిమి తట్టుకోలేక పోతున్నాయి. చెరువుల్లో ఉన్న వందల కొద్ది చేపలు మృత్యువాత పడుతున్నాయి. సంగారెడ్డి నుంచి అందోల్ వెళ్లే దారిలోని చెరువులో ఇలా చచ్చిపోయిన చేపలు కనిపించాయి.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



రూ. 2 లక్షలు నష్టం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి ఊర చెరువు 60 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఈ చెరువులో చేపలు పట్టుకొని తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లోని 130 కుటుంబాలు జీవనం సాగిస్తాయి. వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో చెరువులో పోసిన చేపలు ఎదగలేదు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చిన చేపల పిల్లలను ఆలస్యంగా ఇవ్వడంతో వాటిని చెరువుల్లో పోస్తే పెద్ద చేపలకు ఆహారం అయ్యాయి. ఈ చెరువులో చేపలను చూసి మత్స్యకారుడు ఏడాదికి రూ.4 లక్షలకు లీజుకు తీసుకున్నాడు. ఒకసారి చేపలు పడితే 15 క్వింటాళ్ల వస్తే వాటిని మార్కెట్‌కు తీసుకెళ్తే రూ.1.10 లక్షలు వచ్చాయి. మరో సారి చేపలు పడితే టన్ను వరకు వస్తే రూ.70 వేలు వస్తాయి. మరో రూ.2 లక్షలు మత్స్యకారులకు నష్టం జరిగింది.


వలలను సర్దుకుంటున్న మత్స్యకారులు

చేపలు పెరగలేదు



ఐదేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురువడంతో చెరువుల్లో చేపల పెరిగి లాభాలు వచ్చేది. ఇప్పుడు చేపలను మరో ఊరు వాళ్లకు ఎందుకియ్యాలని నేను పొరుగురు అతడితో కలిసి గుత్తకు పట్టిన. ఎండలకు చెరువు నీళ్లు లేక చేపలు పెరగలేదు.

– పోలవేని శ్రీనివాస్, మత్స్యకారుడు తోటపల్లి

8 క్వింటాళ్లు మాత్రమే..


ఎండిపోయిన తిగుల్‌లోని మహాసముద్రం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో 42 చెరువు, కుంటలు ఉన్నాయి. తిగుల్‌లో రాచకట్ల జలాశయం, ధర్మారంలో బొరబండ ప్రాజెక్టులో కొద్దిపాటి నీరు ఉంది. మిగితా చాలా గ్రామాల్లో చెరువులన్నీ ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. తిగుల్ గ్రామంలో మహాసముద్రంలో గతేడాది 50 వేల చేప పిల్లలను వదిలారు. గ్రామంలో 120 మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. గతేడాది 15 క్వింటాళ్ల చేపలు పట్టగా ఈసారి ఇప్పటికి కేవలం 8 క్వింటాళ్లు మాత్రమే పట్టారు. ప్రస్తుతం చెరువులో చిన్నపాటి గుంతలో నీరు తప్ప చెరువు మొత్తం ఎండిపోయింది.

తక్కువ ధరకు అమ్ముతూ..


కాడిపల్లి పెద్ద చెరువులో తగ్గిన నీరు

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి మండలంలో పదిహేను చెరువుల్లో మత్సకారులు చేపలను పెంచుతున్నారు. ప్రభుత్వం మత్స్య సహకార సంఘానికి ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలు పెరగలేదని ప్రైవేటుగా కొనుగోలు చేసిన చేప పిల్లలు మాత్రం పెరిగాయని తునికి మత్స్యసహకార సంఘం చైర్మన్ చల్లకుమార్‌తోపాటు పలువురు మత్స్యకారులు తెలిపారు. చెరువుల్లో నీళ్లు అడుగంటి పోవడంతో అందులోని చేపలు రోజు చనిపోతున్నాయన్నారు. దీంతో చేసేది లేక చిన్న చేపలను పట్టి తక్కువ ధరకు అమ్ముతుండటంతో నష్టపోతున్నామని వాపోయారు.

తూప్రాన్ రిజిస్ట్రార్ అరెస్ట్

- నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించిన కేసులో..
- మరో ఎనిమిది మంది రిమాండ్


అరెస్ట్ చేసిన వారిని చూపుతున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసిన తూప్రాన్ రిజిస్ట్రార్‌ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడితోపాటు మరో నలుగురిని సైతం అదుపులోకి తీసుకున్నారు. మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో 225, 256 సర్వే నంబర్‌లో వెయ్యి గజాల స్థలంకు హైదరాబాద్‌కు చెందిన మల్లవరపు అరుణ్‌కుమార్ అనే వ్యక్తి మరో 8 మందితో కలిసి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించారు. ఈ డాక్యుమెంట్ ద్వారా హైదరాబాద్ మోతీనగర్‌కు చెందిన సురవజ్ఝుల సత్యనారాయణమూర్తి భార్య స్వాతికి రూ.80 లక్షలకు తూప్రాన్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్‌ను ఫిబ్రవరిలో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఈ ప్లాట్ లింకు డాక్యుమెంట్ల కోసం సత్యనారాయణమూర్తి ఆరాతీయగా, అమ్మిన వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. తన ప్లాట్ కోసం కూచారం గ్రామానికి వచ్చి చూడగా ఆ స్థలం వేరే వ్యక్తుల పేరుతో బోర్డు ఉండటంతో అసలు విషయం బయటపడింది. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు ఫిబ్రవరిలో పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఏప్రిల్ నెలలో నలుగురిని గుర్తించి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో విచారణ పూర్తి కావడంతో మంగళవారం తూప్రాన్ రిజిస్ట్రార్ రమణతోపాటు మరో నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

131 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వట్‌పల్లిలో 101, గజ్వేల్‌లో 30 క్వింటాళ్లు

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంపత్‌కుమార్ కథనం మేరకు.. వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో డీసీఎం వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 205 బ్యాగుల అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వెంటనే సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించి అందోలులోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. దాదాపుగా 101 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. వాహన డ్రైవర్ మహ్మద్ ఫయాజ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోలో తరలింపు

గజ్వేల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెంకు చెందిన మాడోత్ రాజేందర్, బుక్య శ్రీకాంత్‌లు ట్రాలీ ఆటోలో గజ్వేల్ మండల పరిధిలోని సమీప గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు వెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి గ్రామ శివారులో ఆటోను అదుపులోకి తీసుకొని 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


గజ్వేల్ రూరల్ : నిందితులతో పోలీసులు

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంగారెడ్డి: శుభకార్యాయానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చౌటకూరు మండల పరిధిలోని శివంపేట వద్ద మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. పుల్కల్ మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన మంగలి వీరేశం (45) సోమవారం సాయంత్రం ముత్తంగిలోని అత్తగారింటి వద్ద శుభకార్యానికి భార్యాపిల్లలతో కలిసి వెళ్లారు. భోజనం ముగించుకున్న తర్వాత అర్ధరాత్రి వీరేశం ఒక్కడే బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. చౌటకూరు మండలంలోని శివంపేట మలుపు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో వీరేశానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు ఆత్మహత్య

ప్రేమ విఫలమై యువకుడు

జహీరాబాద్ టౌన్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జహీరాబాద్ మండలంలోని హోతి(కె) గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.ప్రసాద్ కథనం మేరకు.. జహీరాబాద్ మండలంలోని ఆనేగుంట గ్రామానికి చెందిన గొల్ల గాళప్ప కుమారుడు గొల్ల వెంకట్(30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన యువతితో ఏడాది కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో పెళ్లిచేసుకోవాలని నిర్ణయించారు. పెళ్లి కోసం వారం రోజుల కిందట వెంకట్ తండ్రితో కలిసి బాల్కొండకు వెళ్లి యువతి తల్లిదండ్రులను అడిగారు. పెళ్లికి అమ్మాయి తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో వెంకట్ మనస్తాపానికి గురై మండలంలోని హోతి(కె) గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అప్పుల బాధతో వ్యక్తి

నిజాంపేట(మెదక్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన కోమ్మట రాజు(25) జేసీబీ మిషన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. రాజు వ్యవసాయ పెట్టుబడి కోసం తెలిసివారి వద్ద రూ. 2 లక్షల అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక మనస్తాపంతో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు సాయంత్రానికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతుకున్న క్రమంలో మంగళవారం ఉదయం తనం పొలం వద్ద ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మద్యానికి బానిసై..

చిన్నశంకరంపేట(మెదక్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పిట్ల సురేశ్ (30) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఎలాంటి పనులు చేయక ఇంటివద్దనే ఉంటుండటంతో కుటుంబ పోషణ భారమైంది. ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

హత్యాయత్నం కేసులో డిప్యూటీ తహసీల్దార్ అరెస్టు

- నిందితుల్లో మరొకరు సోదరుడు
- భూ వివాదం కేసు..

సిద్దిపేటకమాన్: భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో హత్యాయత్నం కేసులో సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. సిద్దిపేట ఏసీపీ మధు కథనం మేరకు.. పట్టణంలోని వడ్డెర కాలనీలో కరీంనగర్‌కు చెందిన అమీన్‌సుల్తానా భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు అమీన్‌సుల్తానా మేనల్లుడు నసీమ్‌ఖాన్ తన తమ్ముడు అతీఫ్‌తో కలిసి ఆ భూమి దగ్గరకు వెళ్లి చూశారు. ఈ క్రమంలోనే పట్టణానికి చెందిన మహేందర్, మరికొంత మందితో కలిసి తనను చంపే ప్రయత్నం చేశారని ఈ నెల 24వ తేదీన సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో నసీమ్‌ఖాన్, అతీఫ్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టగా పట్టణంలోని 1,465 సర్వే నంబర్‌లో అమీన్‌సుల్తానా పేరు పైన ఉన్న 427 గజాల ఖాళీ స్థలాన్ని పట్టణానికి చెందిన సలీం అనే వ్యక్తి గతంలో తన దగ్గర ఉన్న పాత డాక్యుమెంట్లతో డిప్యూటీ తహసీల్దార్ అలకుంట అశోక్‌కు అమ్మాడు. కానీ డిప్యూటీ తహసీల్దార్ అతడి కుటుంబ సభ్యుల (బోదాసు)పై రిజిస్ట్రేషన్ చేయించాడు. అనంతరం అమీన్‌సుల్తానా రావడంతో ఈ స్థలంపై వివాదం ఉన్నట్లు తెలుసుకున్న అశోక్ సలీంతో విక్రయ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు మరో ఒప్పంద పత్రాన్ని రాయించుకున్నాడు. ఈ క్రమంలోనే బోదాసు కుటుంబ సభ్యుల పేరుపైన ఉన్న స్థలాన్ని అలకుంట అశోక్ తన భార్య బీఆర్ఎస్ కౌన్సిలర్ అయిన కవిత పేరు పైన రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ పత్రాలతో మున్సిపల్ పర్మిషన్ తీసుకొని బోరు వేసి ఇంటి నిర్మాణం చేపట్టారు.

ఈ విషయం తెలుసుకున్న అతీఫ్, నసీంఖాన్ భూమి వద్దకు వచ్చి ఇది మా బంధువుల భూమి అని పనులు ఆపాలని అడ్డుకున్నారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ సోదరుడు అలకుంట మహేందర్ మరికొంత మంది వ్యక్తులు కలిసి తనను కొట్టి చంపే ప్రయత్నం చేశారనే బాధితులు అతీఫ్, నసీంఖాన్‌ల ఫిర్యాదు మేరకు సిద్దిపేట ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ అలకుంట అశోక్, తన సోదరుడు మహేందర్‌ను వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు మంగళవారం తెలిపారు. ఇదే ఘటనపై అలకుంట అశోక్ కూడా తనపై దాడి చేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేయగా అతీఫ్, నసీమ్‌ఖాన్‌లపై కూడా కేసు నమోదు చేశారు. మహేందర్‌పై ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయని రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు.

డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ పురుశోత్తంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుశోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కే.పురుశోత్తం రెడ్డి తెలిపారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్‌కు చెందిన ఎండీ. అన్వర్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు హనీఫ్ ఖాన్, రోషన్ జాతన్, ముఖేష్ వర్మ, భీరం సింగ్ వర్మ కలిసి ముఠాగా ఏర్పడి పెట్రోల్ బంకులు, రహదారుల వెంబడి రాత్రి పూట నిలిపిన లారీల్లోంచి డీజిల్‌ను దొంగిలిస్తూ వచ్చే డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డారన్నారు. 2024 జనవరి 1వ తేదీన కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో అర్ధరాత్రి రోడ్డు పక్కన ఆపిన లారీ నుంచి 300 లీటర్ల డీజిల్‌ను ఎత్తుకెళ్లారు. నెల్లూరు జిల్లాకు చెందిన డ్రైవరు ఆది గోపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ముఠాను పట్టుకునేందుకు అడిషినల్ డీసీపీ మల్లారెడ్డి పర్యవేక్షణలో ఏసీపీ పురుశోత్తం రెడ్డి, తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాసలతోపాటు మరి కొందరు సిబ్బందితో ప్రత్యేక టీంగా ఏర్పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున వెలికట్ట శివారులో చేర్యాల క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా 2 డీసీఎంలలో డీజిల్ క్యాన్లు తీసుకెళ్తున్న నలుగురిని పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా జగదేవ్‌పూర్, తూప్రాన్, కుకునూరుపల్లి, వెలికట్ట గ్రామాల శివారుల్లో రోడ్ల వెంబడి నిలిపి ఉన్న లారీల్లోంచి డీజిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారన్నారు. ఇందులో శంషాబాద్‌కు చెందిన ఎండీ. అన్వర్ పరారీలో ఉన్నాడు. నలుగురు నిందితులను సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించాలని తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు.

గోడ కూలి మహిళ మృతి

హవేళిఘణాపూర్(మెదక్): గోడ కూలి మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముత్తాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎరుకల సువర్ణ(35) అదే గ్రామానికి చెందిన చాకలి శ్యామయ్య ఇంటికి కూలీ పని కోసం వెళ్లింది. ఇల్లు మరమ్మతు చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గోడ కూలి సువర్ణపై పడింది. ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న క్రమంలో ఆమెను బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమెతో పాటు మేస్త్రీ రవీందర్‌కు గాయాలయ్యాయి. ఎస్ఐ ఆనంద్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.